క్లుప్తంగా

దేవస్థానానికి జిరాక్స్ మిషన్ వితరణ



జిరాక్స్ మిషన్‌కు పూజలు నిర్వహిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానానికి నంద్యాలకు చెందిన ఆకుమల్ల రమేష్ బాబు, బ్రహ్మయ్య గురువారం రూ.లక్ష విలువైన జిరాక్స్ మిషన్ విరాళంగా అందించారు. ఈ మేరకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ఎంతో సహకరిస్తున్నారని ఈఓ చెప్పారు.

ఇంటికి తాళం వేసి వెళ్తే సమాచారం ఇవ్వండి

జూపాడుబంగ్లా: దసరా పండుగ సందర్భంగా ఇళ్లకు తాళాలువేసి స్వగ్రామాలకు, దేవస్థానాలు, విహారయాత్రలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంట్లోని విలువైన బంగారు, నగదు, వెండి వస్తువులను భద్రపర్చుకోవాలన్నారు. లేదా వాటిని బ్యాంకు లాకర్లలో ఉంచుకొని వెళ్లాలన్నారు.ఆర్థిక స్థోమత కలిగిన వారు ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: పట్టణంలో శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి..? అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని , పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, మార్కెట్‌యార్డ్‌చైర్మన్లు, కన్వీనర్లు, పార్టీ మహిళా కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

వాచ్‌మెన్ కుటుంబానికి ఆర్థికసాయం

నందికొట్కూరు: పట్టణంలోని మార్కెట్‌యార్డులో చాలా సంవత్సరాల నుంచి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న భగవాన్‌దాస్ (56) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ షేక్ రాహత్ జబ్బార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు షేక్ జబ్బార్ గురువారం తాటిపాడు చేరుకొని భగవాన్‌దాస్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ. 15000 ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ.. భగవాన్‌దాస్ మృతి విషయం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన స్పందిస్తూ మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానని మాటిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జలీల్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఆత్మకూరు: పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌వద్ద 8 వార్డులో గురువారం సీసీ రోడ్డు రహదారులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పట్టణంలోని శివారు కాలనీలను కూడా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వార్డు కౌన్సిలర్ మోతుల్లా, రెహమాన్, శంకర్, పార్వతి, రంగస్వామి, ప్రకాష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, జిల్లా కార్యదర్శి తిమోతి, శ్రీనివాసులు, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శోభారాణి తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయిలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పారుమంచాలలో జగనన్న ఆరోగ్య సురక్ష

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామసచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. గ్రామ ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో కొలనుభారతిదేవి అమ్మవారు



నందికొట్కూరులో ధనలక్ష్మిదేవి అవతారం



కొణిదేలలో చాముండేశ్వరీ దేవీ అలంకరణలో అమ్మవారు



ఆత్మకూరులో మహాలక్ష్మీదేవి అలంకరణ



వెలుగోడులో శ్రీమహాలక్ష్మిగా



ఓంకారంలో లలితాదేవిగా శ్రీ ఉమాదేవి అమ్మవారు

కనకదుర్గా.. పాహిమాం

- ఐదో రోజు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- కొలనుభారతి మహానంది, ఓంకారం క్షేత్రాల్లో విశేష పూజలు

మహానంది: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది, ఓంకారం పుణ్యక్షేత్రాల్లో గురువారం ఐదోరోజు పూజలు వైభవంగా జరిగాయి. మహానందిలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ ఆధ్వర్యంలో రుద్ర, చండీహోమాలు జరిగాయి. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారంలో ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. అమ్మవారిని శ్రీ లలితాదేవి అలంకరించారు. బుక్కాపురంలో మహాచండీదేవిగా, బొల్లవరంలో శ్రీ స్కందమాతగా కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని తరించారు. బండిఆత్మకూరు మండలం కాకనూరులోని శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి శ్రీ శివయోగీంద్ర సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో శ్రీ శారదాదేవికి వైభవంగా పూజలు చేశారు.

కొత్తపల్లి: శ్రీమహాలక్ష్మీదేవి మహిమ చూపవమ్మ అంటూ భక్తులు భక్తిపరావశ్యంతో అమ్మవారిని వేడుకున్నారు. దేవి నవరాత్రుల్లో భాగంగా ఐదో





సంగమేశ్వరంలో స్కందమాతగా శ్రీ లలితాదేవి అమ్మవారు,శ్రీశైలంలో శ్రీలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

రోజు కొలనుభారతిదేవి ఆలయంలో అమ్మవారికి మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అదేవిధంగా సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో శ్రీలలితాదేవి అమ్మవారు దేవి నవరాత్రుల్లో భాగంగా స్కందమాతగా, శ్రీ లలితా త్రిపుర సుందరిగా, మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేసుకొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో వెలసిన అమ్మవారు కన్యకా పరమేశ్వరి మాత గురువారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శ్రీదేవిగా అలంకరించారు. అలాగే శ్రీఅంబాభవాని, వెంకటేశ్వరస్వామి, సాయిబాబ, అన్ని శివాలయాలతో పాటూ సుంకులమ్మ, జంబులపరమేశ్వరి దేవాలయాల్లో అమ్మవారు వివిధరూపాల్లో దర్శనమిచ్చారు.

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యాక పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచారు. వేల్పనూరులో వెలసిన అంకాల పరమేశ్వరి అమ్మవారిని స్కంద మాత దేవి రూపంలో అలంకరించారు.

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వాసవి నిత్యాన్నదాన సత్రంలో శ్రీదేవిశరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఐదవ రోజు గురువారం వాసవిమాతను లక్ష్మీదేవిగా అలంకరించి విశేషపూజలను నిర్వహించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం వాస ఛుమాత గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొనిదేల గ్రామంలోని శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామి దేవాలయంలో భ్రమరాంబాదేవీ అమ్మవారు ఐదవరోజు చాముండేశ్వరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో వెలసిన సరస్వతీ అమ్మవారు స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. తాటిపాడు, జూపాడుబంగ్లా గ్రామాల్లో వెలసిన అమ్మవారు పార్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మిడుతూరు : మండల పరిధిలోని శ్రీకన్యకాపరమేశ్వీమాత, చౌడేశ్వరీ దేవాలయంలో దసరానవరాత్రులను పురస్కరించుకుని ఐవదరోజు అమ్మవారు ధనలక్ష్మిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందికొట్కూరు : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారు ధనలక్ష్మిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

193 మందికి ‘జగనన్న చేదోడు’

జూపాడుబంగ్లా: మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో 193 మందికి జగనన్న చేదోడు పథకం వర్తించినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టైలర్లు, నాయీబ్రాహ్మణులు, రజకులకు చేదోడు పథకం కింద నాలుగోవ ఏడాదిగా ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.10వేల చొప్పున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని చేతివృత్తిపై ఆధారపడిన వారు అభివృద్ధి బాట పట్టాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో ‘పిడికెడు బియ్యం’



అధ్యాపకుల నుంచి నగదు, బియ్యాన్ని సేకరిస్తున్న కళాశాల సిబ్బంది

నందికొట్కూరు : పట్టణంలోని డీగ్రీ కళాశాలలో గురువారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పిడికెడు బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకుల వద్ద నుంచి 60 కేజీల బియ్యం, రూ.2,600 నగదును సేకరించి వాటితో నిత్యావసర సరుకులు కొని పట్టణంలోని నిరాశ్రయులకు అందజేసినట్లు ప్రిన్సిపల్ సునీత తెలిపారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు రామక్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహానందంగా తీర్చిదిద్దుతాం



మహానందిలో మూవింగ్ క్యూలైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: మహానందిని మహానందంగా తీర్చిదిద్ది, మహానందీశ్వరుడి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాని, శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం రాత్రి నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే శిల్పా సొంత డబ్బులు రూ. 3కోట్లు వెచ్చించి చేపడుతున్న సుందరీకరణ పనులు పరిశీలించి ఆర్కిటెక్చర్ నిపుణులుకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ. 4.60కోట్ల టీటీడీ నిధులతో వసతిగృహాల నిర్మాణం, రూ. 80లక్షలతో కోనేరుల ఆధునికీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. త్వరలో వంద వసతి గృహాలను దాతల ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు మహానందీశ్వరస్వామి సొమ్మును దోచుకుతిన్నారని, మహానందికి రావాలంటే భక్తులు భయపడే పరిస్థితిని తెచ్చారన్నారు.

తొలిసారి మూవింగ్ క్యూలైన్లు ప్రారంభం

మహానంది ఆలయంలో తిరుమల, శ్రీశైలం తరహాలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మూవింగ్ క్యూలైన్లను గురువారం రాత్రి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. అమెరికాలో ఉంటున్న చెరుకుమిల్లి శ్రీరామ్‌శర్మ, లావణ్యలతో పాటు ఆలయ అర్చకులు శరభయ్య శర్మలు రూ. 1.25లక్షలు వెచ్చించి చేయించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గంగిశెట్టి మల్లికార్జున, బుసకాని వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ డీఈ శ్రీనివాసప్రసాద్, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- ప్రతి ఒక్కరూ సైనికుల్లా పోరాడాలి
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: రాష్ట్రాభివృద్ధి కోసం పరితపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పోరాడాలని, నాలుగు నెలలు కష్టపడితే మరో ఐదేళ్లు సేవలందిస్తానని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానందిలోని ఉడిపి రమణ కళ్యాణ మండపంలో గురువారం ''ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు సీఎం జగన్ అవసరం'' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ, గ్రామ కన్వీనర్లు, గృహసారథులు, మండల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న జగనన్న మళ్లీ సీఎంగా చేసుకుందామన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ రైతులు, ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాని, నాలుగు నెలలు కష్టపడితే మరో ఐదేళ్లు మీకు సేవలు అందిస్తానన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బూతుల పురాణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అలాంటి నాయకుడు కావాలా?.. లేక అనుక్షణం మనకు ఫోన్ చేస్తే అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే శిల్పా చక్రపాణిరెడ్డి కావాలా అంటూ ప్రజలకు తెలియచేయాలన్నారు. నేను మంచి చేసి ఉంటేనే నాకు ఓటేయండటంటూ బహిరంగంగానే అడుగుతున్నానని స్పష్టం చేశారు. సాగునీటి కోసం లస్కర్‌లా పనిచేస్తున్నానని చెప్పారు. గడపగడపకు మనప్రభుత్వం ఎంతో విజయవంతం చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఆత్మకూరు, వెలుగోడు గ్రామాల్లో రూ.19కోట్లతో ఆస్పత్రులు కట్టించామన్నారు.

కోర్టులు మా చేతుల్లో ఉన్నాయా బాబూ?..

అవినీతికి పాల్పడి, తప్పులు చేసి చంద్రబాబు జైలుకు వెళ్లారని, ప్రతిపక్షపార్టీలు అధికారపార్టీ కక్షసాధింపు చర్యలంటూ చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే న్నారు. అత్యున్నతమైన న్యాయస్థానాలు మా చేతుల్లో ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. స్టేల మీద స్టేలు తెచ్చుకుని కాలయాపన చేయడం మీకే చెల్లుతుందని విమర్శించారు. సమావేశంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, మహానంది ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ గజ్జ పెద్ద ఫక్కీరయ్య, సూర్యనంది మాజీ చైర్మన్ సాగేశ్వరరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పగడాల నాగరాజు, మాజీ ధర్మకర్త బండి శ్రీనివాసులు, నాయకులు సాంబిరెడ్డి, బాలవెంకటరెడ్డి, పెద్ద మహానందిరెడ్డి, కోలా శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు





లింగాపురంలో గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ రవీంద్రారెడ్డి, కొత్తముచ్చుమర్రిలో మందులు పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి రఘురాం

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలు ఇవ్వండి
- ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

మహానంది: జగనన్న ఆరోగ్య సురక్షలో చికిత్స, వైద్యసేవలు పొంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే గిరిజనుల వివరాలతో కూడిన నివేదికలు ఐటీడీఏకు సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రవీంద్రారెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం జి.లింగాపురంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ వాసుదేవగుప్త, వైద్యాధికారి డాక్టర్ భావనరెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ దినేష్‌కుమార్, సిబ్బందితో మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి వివరాలు ఇస్తే వారికి ఐటీడీఏ ఆధ్వర్యంలో సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. చెంచులు,గిరిజనులు పోషకాహారాన్ని తీసుకునేలా ఐసీడీఎస్ వారు అవగాహన కల్పించాలని సూచించారు. లింగాపురంలో 704 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు.

పేదలకు రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్ష అని మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. సీతారామాపురం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 516 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు బుడ్డారెడ్డిగారి ప్రభాకర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన

పగిడ్యాల: మండల పరిధిలోని పాత ముచ్చుమర్రిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో కొనసాగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి ప్రారంభించారు. శిబిరంలో 771 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు 23 మందిని మెరుగైన చికిత్స తీసుకోవడం కోసం ఆరోగ్య శ్రీ కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ రవి, గ్రామ సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

మిడుతూరు : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 49 బన్నూరు, చౌట్కూరు గ్రామాలలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 603 మంది ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ షానవాజ్, సర్పంచ్ లు భూదేవి, మదార్‌సాహెబ్, ఉప సర్పంచ్ జగన్‌మోహనరెడ్డి, వైద్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికి ఉచిత వైద్యం

ఆత్మకూరు: పేదలందరికి ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్ అన్నారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవినాయక్, ఏసీఎస్ కన్వినర్ లక్ష్మీరెడ్డి, వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామాపురంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎంపీపీ యశస్విని



ముష్టపల్లెలో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి



చౌట్కూరులో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి

అంకాలమ్మ చెంచుగూడెంలో సదుపాయాలు కల్పించండి

శ్రీశైలంప్రాజెక్ట్: నంద్యాల జిల్లా రుద్రవరం మండంలోని ఆలమూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంకాలమ్మ చెంచుగూడెంలో మౌలిక వసతులు కల్పించాలని గిరిజనులు కోరారు. గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజనులు ఐటీడీఏ ఏపీఓ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గూడెంలో సరైన నీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్‌సరఫరా లేవని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే జునైద్ బాష, గూడెం వాసులు రవణమ్మ, సుంకమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఏపీఓకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని తరిగోపుల గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తగాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. ఇళ్ల వద్ద, పొలం వద్ద, కళ్లాల వద్ద ఏదేని సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా బెల్టుదుకాణాలు నిర్వహించినా, అక్రమంగా మద్యం విక్రయించినా, నాటుసారా విక్రయించినట్లు తెలిసినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన కూర్చొని మద్యం సేవిస్తే ఉపేక్షించేదిలేదన్నారు.



తరిగోపులలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మారుతిశంకర్

21న బహిరంగ చర్చా కార్యక్రమం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 21వ తేదీన 17వ విడుత సామాజిక తనిఖీ చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 8 గ్రామ పంచాయతీలలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై 17వ విడుత సామాజిక తనిఖీ చేపట్టారన్నారు. సోషల్ ఆడిట్‌లో డీఆర్‌పీలు గుర్తించిన అంశాలను బహిరంగ చర్చా వేదికలో వెల్లడిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధి సిబ్బంది , మేట్ హాజరు కావాలని కోరారు.

జమ్మిచెట్టు వద్ద విద్యుత్ వెలుగులు

నందికొట్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని జమ్మిచెట్టు (శమీవృక్షం) దగ్గర గత కొన్నేళ్లుగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన మున్సిపల్ చైర్మన్ శ్రీదాసి సుధాకర్ రెడ్డి మున్సిపల్, విద్యుత్తు సిబ్బందితో గురువారం అక్కడికి చేరుకొని విద్యుత్ సౌకర్యంతో పాటు వీధి లైట్లు ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ జమ్మి చెట్టు దగ్గర ఎన్నో సంవత్సరాల నుంచి విద్యుత్ సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దసరా ఉత్సవం ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడకూడదని అక్కడ విద్యుత్ సౌకర్యంతోపాటు వీధి దీపాలనుకూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నో ఏళ్ల కలను సాకారం చేసినందుకు దసర ఉత్సవ సమితి, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు బద్దుల శ్రీకాంత్, ఆర్ట్ శ్రీను, మోటు మురళి తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టు వద్ద విద్యుత్ సౌకర్యంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం